క్లుప్తంగా...

అమర్‌సింగ్‌కు సన్మానం



అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న రాహుల్‌కుమార్

జియాగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో కార్వాన్‌లో ఎంఐఎంకు గట్టి పోటీని ఇవ్వడంతో పాటు బీజేపీ అఖండ విజయం సాధిస్తుందని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. శనివారం జియాగూడలో పార్టీ సీనియర్ నాయకులను ఇంటింటికీ వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బగిడి రాహుల్‌కుమార్ అమర్‌సింగ్‌ను సన్మానించారు. అనంతరం జియాగూడలోని దుర్గానగర్, సంజయ్‌నగర్, వాల్మీకినగర్, 2జే బస్టాండ్, కేశవస్వామినగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న సీనియర్ నాయకులను అమర్‌సింగ్ కలిశారు. జియాగూడలో బీజేపీ పటిష్టతతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీమోర్చా నాయకులు సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



మీర్జా ఎక్బాల్ అహ్మద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నజీబ్ తదితరులు

గోల్కొండ: సేవా కార్యక్రమాలు నిర్వహించే వారిని ప్రజలు గౌరవిస్తారని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. న్యాయవాదిగా పేదలకు స్వచ్ఛంద సంస్థలకు ఉచితంగా సేవలు అందిస్తున్న మీర్జా అసోసియేట్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది మీర్జా ఎక్బాల్ అహ్మద్‌ను టీఎఫ్‌సీఓ వారు శనివారం టోలిచౌకీ రాహుల్ కాలనీలో సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. నిస్వార్థ న్యాయవాదుల, ప్రజా సేవలకు కారణంగానే టీఎఫ్‌సీఓ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాలేద్ ఆలీ ఖాన్, సయ్యద్ వజాహత్ ఆలీ తదితరులున్నారు.

రూ.1.70 లక్షల నగదు పట్టివేత

జియాగూడ: జియాగూడ రహదారిలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.1.70 లక్షల నగదు లభించినట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం జియాగూడ రహదారి భగత్‌సింగ్ చౌరస్తాలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా కాటేదాన్‌కు చెందిన కురుకురే కంపెనీ సేల్స్ అండ్ కలెక్షన్స్ రామ్‌కుమార్ రూ.1.70 లక్షలతో వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో నగదును సీజ్ చేశారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అక్షజ్ఞ పబ్లికేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కళారత్న బిక్కి రచించిన ఓల్డర్ అండర్‌స్టాండింగ్ పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. వయోవృద్ధుల ఆలోచనలు, ఎదుర్కొనే సమస్యలను రచయిత ఎంతో అద్భుతంగా వివరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాపూరమణల లోగిలి వ్యవస్థాపకులు వింజమూరి వెంకట అప్పారావు, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, హాస్యనందం ఎడిటర్ పి.రాము, పబ్లికేషన్స్ ప్రతినిధులు డాక్టర్ వెంకట్, విద్యాభార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



గోల్కొండ: వాల్మీకి జయంతిని కార్వాన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, కిషన్, షకీలా, గోవర్ధన్‌రెడ్డి, ముంగి రఘుపాల్ రెడ్డి, చంద్రశేఖర్, చంటిబాబు తదితరులున్నారు.

30న ఆర్టీసీ డయల్ యువర్ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ ఎప్పుడు కృషి చేస్తుందని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి అన్నారు. ప్రయాణికుల సూచనలు, సలహాలను తాము ఎప్పుడూ గౌరవించి వాటిలో సాధ్యమైన సూచనలను పాటిస్తు వస్తున్నామని ఆయన తెలిపారు. బస్సు వేళల్లో మార్పులు, కొత్త రూట్‌లలో బస్సు సర్వీసులు, కొన్ని రూట్‌లలో అదనపు బస్సులు తదితర విషయాలపై ప్రయాణికులు నేరుగా డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఫోన్‌లో తెలపవచ్చునని ఆయన అన్నారు. దీని కోసం డిపో మేనేజర్ ప్రయాణికులకు ఈనెల 30న ఫోన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని ఆయన తెలిపారు. 9959226133లో సంప్రదించాలని కోరారు.

‘గుట్ట’లో విపక్షాలకు ఈ సారైనా

డిపాజిట్లు దక్కేనా?

- ఆరోసారి బరిలోకి దిగుతున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ
- ఎప్పటికప్పుడు పెరుగుతున్న అక్బరుద్దీన్ మెజార్టీ



ఆర్వో నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుంటున్న అక్బరుద్దీన్ ఒవైసీ (ఫైల్)

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ రోజురోజుకూ తిరుగులేని శక్తిగా బలపడుతుండడంతో ప్రతిపక్షాలు డిపాజిట్లు దక్కించుకోవడానికి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ శాసనసభ పక్ష నేత, నియోజకవర్గం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై పోటీకి విపక్ష పార్టీలు మైనార్టీ నాయకులనే రంగంలోకి దించినప్పటికీ ఏ ఒక్క పార్టీ కూడా డిపాజిట్ సాధించలేకపోయింది. కాంగ్రెస్ పార్టీ తరఫున క్రీడాకారుడైన ఈసా మిశ్రీ, బీజేపీ నుంచి సయ్యద్ షహజాది, బీఆర్‌ఎస్ నుంచి ఉద్యమకారుడు ముప్పిడి సీతారాంరెడ్డి, ఎంబీటీ అభ్యర్థి ముస్తఫా అందరు కలిసి ఎంతో హడావుడి చేసినప్పటికీ అక్బరుద్దీన్‌కి వచ్చిన మెజార్టీలో సగం ఓట్లు కూడా రాబట్టలేకపోయారు. ఇక ఈసారి బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు మైనార్టేతర అభ్యర్థులను ప్రకటించడంతో అక్బరుద్దీన్‌కు ఎదురేలేదని మజ్లిస్ శ్రేణులు భావిస్తున్నాయి. ఎంబీటీ అభ్యర్థి ఏ మేరకు ప్రభావం చూపుతాడన్నది అభ్యర్థి బలాన్ని బట్టి తెలిసే అవకాశం ఉంది.

ఆరోసారి బరిలోకి..

- 1999 నుంచి వరుసగా ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించిన అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోసారి తాజాగా బరిలోకి దిగుతున్నారు.
- 1999లో ఎంబీటీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అమానుల్లా ఖాన్‌పై 11,920 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా...అనంతరం ఎంబీటీ అభ్యర్థి ఖాయంఖాన్‌పై 2004లో 11,944 మెజార్టీ, 2009లో 15,177 ఓట్ల మెజార్టీ, 2014లో 59,248 ఓట్ల మెజార్టీ సాధించారు.
- ఇక 2018లో ప్రత్యర్థులు ఎవరూ కూడా ఆయనకు దారి దాపుల్లో పోటీ ఇవ్వకపోవడంతో 80,264 ఓట్ల భారీ మెజార్టీ దక్కింది.
- అక్బరుద్దీన్ ఒవైసీ విజయాన్ని అందరూ ఊహించినదే అయినప్పటికీ..ఎవరు అనుకోనంతగా భారీ మెజార్టీ ఆయన సొంతమయ్యింది.

2018లో వివిధ పార్టీలు సాధించిన ఓట్ల వివరాలు..

- 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 2,91,022 ఓట్లకు గాను 46.11 శాతంతో మొత్తం 1,40,291 ఓట్లు మాత్రమే పోలయ్యాయి.
- ఇందులో మజ్లిస్ పార్టీ అభ్యర్థి అక్బరుద్దీన్ ఒవైసీకి 95,339 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి సయ్యద్ షహజాదీ 15,075, టీఆర్‌ఎస్ అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి 14,224, కాంగ్రెస్ అభ్యర్థి ఇసా బిన్ ఒబేద్ మిశ్రీ 11,309, బీఎల్‌పీ అభ్యర్థి మహ్మద్ హాజీ 506, ఎంబీటీ అభ్యర్థి ముస్తఫా 499, శివసేన అభ్యర్థి 197 ఓట్లు సాధించారు.
- వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థులు అక్కినమోని వెంకటేష్ 112, అంజద్ ఖాన్ 180, కానుగుల శ్రీనివాస్ 229, మహ్మద్ గౌస్ 173, మహ్మద్ అబ్దుల్లా బేగ్ 834, మహ్మద్ హామేద్ సిద్దిఖీ 187, రాజు కొత్తూరు 193, సి.శివ శంకర్ 224ల చొప్పున ఓట్లు సాధించారు. నోటాకు 1009 ఓట్లు పోలయ్యాయి.

జంగ్ తెలంగాణ 2023

‘మోదీ పథకాలతోనే విజయం సాధిస్తా’



బేగంబజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలతోనే తాను విజయం సాధిస్తానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. బేగంబజార్ పరిధిలోని ఎల్‌ఎంజీ స్కూల్, దీపా నర్సింగ్‌హోమ్‌తో పాటు పలు ప్రాంతాల్లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ..తనను గెలిపిస్తే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పదేళ్లుగా బీజేపీ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలంతా బీజేపీవైపు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మాటలు ప్రజలు నమ్మేస్థితిలో లేరని రాజాసింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్‌యాదవ్, లడ్డులాల్‌యాదవ్, నట్రాజ్ నామ్‌దారి, ముక్కా కృష్ణాగుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బీసీ ముఖ్యమంత్రి హామీపై హర్షం



ఆలే భాస్కర్‌తో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: బీజేపీ ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నిలబెట్టుకునే పార్టీని తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆలే భాస్కర్ అన్నారు. అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ ప్రకటించడంతో పలువురు బీజేపీ నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛమైన పాలన అందించే సత్తా కేవలం బీజేపీకే ఉందన్నారు. ఆయనను కలిసిన వారిలో బీజేపీ కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, దీపిక, దేవర శ్రీనివాస్, అర్పన్‌కుమార్, సి.పెంటప్ప తదితరులున్నారు.

గద్దర్ ప్రపంచస్థాయి ఉద్యమకారుడు



గద్దర్ సంస్మరణ సభలో మాజీ హోం మంత్రి దేవేందర్‌గౌడ్ తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రజా గాయకుడు గద్దర్ ప్రపంచ స్థాయి ఉద్యమ కళాకారుడని ఆయన ఆప్తా మిత్రుడు సియాసత్ పూర్వ సంపాదకులు జహిరుద్దీన్ ఖాన్ అంతే దాతృత్వం గల గొప్ప వ్యక్తి అని వక్తలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం హనుమాన్ టేక్డీలోని వీసీ సాధికారత భవన్‌లో వారిద్దరి సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో వక్తలు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు సంస్థ చైర్మన్, మాజీ ఎంపీ టి.దేవేందర్‌గౌడ్ అధ్యక్షత వహించగా కవి, సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్ సమన్వయ కర్తగా వ్యవహరించారు. అనంతరం దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో ప్రజలు ఎంత గొప్పగా పోరాడారో, గద్దర్ కూడా తన పాటతో ఉద్యమాన్ని రగిలించారన్నారు. జహిరుద్దీన్ సైతం తనవంతు ఉద్యమానికి సహకరించారని తెలిపారు. సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. తాను మిత్రులతో కలిసి స్థాపించిన హార్ట్ లవర్స్ ద్వారా గద్దర్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. ఆయన లేని లోటు తెలంగాణకు తీరేది కాదన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ ఆంజనేయ రెడ్డి, దళితనేత డాక్టర్ జేబి.రాజు, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఆచార్య తిరుమలి, సీఎల్ యాదగిరి, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

30న అక్కినేని ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో ఈనెల 30న రవీంద్రభారతిలో పలువురు టీవీ నటీనటులకు అక్కినేని ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ప్రముఖ గాయని ఆమని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎస్.మధుసుదనచారి, పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్తా, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బందారు సుబ్బారావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కినేని సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ



భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో..

గౌలిపురా: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని భవానీనగర్ పోలీసులు శనివారం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని ఓల్గా హోటల్ తదితర ప్రాంతాల్లో ఎస్సైలు, సిబ్బంది వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున లావాదేవీలు నిర్వహించే వ్యాపారులు డబ్బులకు సంబంధించిన సరైన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని ఇన్‌స్పెక్టర్ రవీందర్ సూచించారు.

టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో..



కార్వాన్ గణేష్‌ఘాట్ వద్ద..

విజయనగర్‌కాలనీ: టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్వాన్ గణేష్‌ఘాట్ వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఒసామా బిన్ అల్ హాజారి కారును పోలీసులు తనిఖీ చేశారు. కుల్సుంపురా ఏసీపీ ఎం.ఎ.జావేద్, ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా’



సమావేశంలో మాట్లాడుతున్న షబాజ్ ఖాన్

శాలిబండ: రాష్ట్రంలో ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న షబాజ్ ఖాన్ అన్నారు. శనివారం చార్మినార్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాము నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ ఓటు వేయాలని ఇంటింటికీ తిరుగుతూ కోరామన్నారు. చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు మీర్ అసద్ అలీ, మహమ్మద్, అమేర్ అలీ, జుబేర్ బిన్ తదితరులు పాల్గొన్నారు.

‘రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే’



నరేందర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాజేంద్రనగర్ కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్ అన్నారు. ఆయనను కాంగ్రెస్ అధిష్ఠానం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పథకం ప్రతి ఒక్కరిని ఆకర్షించిందని ఉట్టుట్టి వాగ్దానాలు చేయకుండా అమలుకు సాధ్యమైన వాటిని మాత్రమే కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, చంటిబాబు, ఎం.జైపాల్‌రెడ్డి, రాములు, గజిరే కిషన్ తదితరులున్నారు.

పద్యగానంపై అవగాహన కల్పించాలి



విజేతలతో డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి పద్యగానంపై అవగాహన కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శనివారం రవీంద్రభారతిలో సత్కళాభారతి 27వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాఠశాల విద్యార్థులకు భాగవత పద్యగాన పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి కార్టూన్, పద్యగాన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్ వి.ఉదయ శంకర్, సంగీత దర్శకులు ఎన్.పార్థు, హాస్యనందం సంపాదకులు పి.రాము, సత్కళాభారతి అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్జీవోస్ కృషి



డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనిని సత్కరించిన దృశ్యం

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి హైదరాబాద్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం. ముజీబ్‌హుస్సేని పేర్కొన్నారు. టీఎన్జీవోస్ యూనియన్ గవర్నమెంట్ గార్డెన్స్ ఆర్టికల్చర్ యూనిట్‌కు జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన నూతన కమిటీ డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. రేయింబవళ్లు ఉద్యోగులకు అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానన్నారు. గవర్నమెంట్ గార్డెన్స్ ఆర్టికల్చర్ యూనిట్ అధ్యక్షుడిగా మహ్మద్ మొయినుద్దీన్, ఉపాధ్యక్షులు అహ్మద్ ఖాన్, డి.అనురాధ, కార్యదర్శిగా ఇ.జ్యోతి, జాయింట్ కార్యదర్శులుగా జి.సందీప్, మహ్మద్ సాదత్ వికార్, కోశాధికారిగా పర్శరాములును, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కేఆర్.రాజ్‌కుమార్ వ్యవహరించారు.

క్రీడారంగాన్ని విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం



కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: క్రీడారంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ధూల్‌పేట్‌లో వీర్‌లోదేశ్వర్ రవీందర్ పహిల్వాన్ కేసరి కుస్తీ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. వందలాది మంది మల్లయోధులు గోషామహల్ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ ఎవ్వరికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. వేలాదిమంది క్రీడాకారులు ప్రభుత్వ ప్రోత్సాహం లేక తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే క్రీడారంగానికి ఆదుకుంటామన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో క్రీడాకారులకు తాను అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తానని మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు.

చిమ్మపూడి ఫౌండేషన్ చతుర్థ వార్షికోత్సవం



వార్షిక సంచికను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

నాంపల్లి: సాహిత్య, సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవా సంస్థ చిమ్మపూడి ఫౌండేషన్ చతుర్థ వార్షికోత్సవం వేడుకలు శనివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఘనంగా జరిగాయి. దూరదర్శన్ పూర్వ సంచాలకులు డాక్టర్ పాలకుర్తి మధుసూదన రావు అధ్యక్షతన ప్రారంభమైన వేడుకలకు ముఖ్య అతిథిగా డాక్టర్ కేవీ రమణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాహిత్య, సాంస్కృతిక సేవా రంగాల్లో విశేషమైన సేవలందిస్తున్న రసమయి సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.కె.రాము, యువకళా వాహిని సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, వంశీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వంశీరామరాజు, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురామ్, జీవీఆర్.కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి, అభినందన సంస్థ అధ్యక్షురాలు ఇ.భవాని, నవ్య నాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయకుమార్, యువ భారతి డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, లిటిల్ మ్యుజిషియన్ అకాడమి రామాచారి లకు సేవా పురస్కారాలను అందజేశారు. అలాగే పత్రికాధిపతులు బైస దేవదాసు (నేటి నిజం), పొత్తూరి సుబ్బారావు(సాహితీకిరణం), మహ్మద్ రఫీ(కళ)లకు సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహనరావు, ప్రముఖ సాహితీవేత్త సుధామ, ప్రముఖ ఆధ్యాత్మిక వక్త జి.సత్యవాణి పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలి



మధుసూదన్‌గౌడ్

చార్మినార్: శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగియడానికి సహకరించిన ఉత్సవాల నిర్వాహక కమిటీ ప్రతినిధులతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులకు ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో అందుబాటులో ఉన్న కొంత మంది కమిటీ ప్రతినిధులతో సమావేశమై అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఉత్సవాలను సైతం ఘనంగా నిర్వహించడానికి అందరి సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జియాగూడ: మద్యానికి బానిసైన భర్తను పనికి వెళ్లమని చెప్పడంతో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సబ్జిమండి ప్రాంతంలో ఉంటున్న బి.లక్ష్మణ్(38) ఇతనికి భార్య శశిరేఖ, 10 ఏళ్ల బాబు ఉన్నాడు. లక్ష్మణ్ మద్యానికి బానిస అవ్వడంతో శశిరేఖ ఓ స్కూల్‌లో ఆయాగా పనిచేస్తుంది. శుక్రవారం స్కూల్‌కు వెళ్తూ పనికి వెళ్లాల్సిందిగా లక్ష్మణ్‌కు చెప్పి వెళ్లింది. లక్ష్మణ్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రి ఇంటికి వచ్చిన భార్య శశిరేఖ గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించడంతో మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



బీజేపీ నాయకులతో కార్వాన్ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు తమవెంట పలు ఇతర పార్టీల కార్యకర్తలను తీసుకొచ్చి అమర్‌సింగ్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అమర్‌సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో 20 ఏళ్ల వెనక్కి పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు సునీల్‌యాదవ్, టోలిచౌకీ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, నర్సింహ, మహేశ్వర్, విజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి’



బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను సత్కరించిన నాయకులు

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలతోనే అన్నివర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. మైనార్టీలతో పాటు అన్ని వర్గాల కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడం గర్వకారణమన్నారు. మంగళ్‌హాట్, దత్తాత్రేయనగర్ ప్రాంతాల్లో పలువురు మైనార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌కు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ..10 ఏళ్లుగా గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా కేవలం బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. మంత్రి తలసాని సహకారంతో నియోజకవర్గం నలుమూలలా కోట్లాది రూపాయాల అభివృద్ధి చేపట్టామన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించి బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామని నందకిశోర్‌వ్యాస్ బిలాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో వహీద్, మహ్మద్, పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

సంతోష్‌నగర్: మటన్ షాపులో యువకుడి హత్యకు పాల్పడిన కేసులో సంతోష్‌నగర్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని శనివారం రిమాండ్‌కు తరలించారు. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బి.రోహిత్ రాజు ఇన్‌స్పెక్టర్ పి.శివచంద్ర, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చిట్టీ బుర్రాతో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాల ప్రకారం.. ఈదిబజార్‌కు చెందిన మహ్మద్ ఘనీ ఖురేషి కుమారుడు మహ్మద్ నవీద్ గఫార్ ఖురేషి (19) ఈదిబజార్ మహ్మద్‌నగర్ గౌసియా మసీదు సమీపంలోని తండ్రి మటన్ షాపులో పని చేస్తుంటాడు. నవీద్ ఈదిబజార్ జావీద్‌నగర్‌కు చెందిన మహ్మద్ మోయిజ్ (23), మహ్మద్ ఇస్మాయిల్ ఆలియాస్ మ్యాడి (19)తో కలిసి ఇటీవల శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసులో జైలు నుంచి విడుదలైన అనంతరం నవీద్ గఫార్ ఖురేషి, మహ్మద్ మోయిజ్‌ల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా ఇటీవల నవీద్ గఫార్ ఖురేషి తన స్నేహితుడు మన్సూర్‌తో కలిసి మహ్మద్‌నగర్‌లో మోయిజ్‌పై దాడి పాల్పడ్డాడు. అనంతరం మోయిజ్‌ను హత్య చేస్తే రూ.50 వేలు ఇస్తానని మహ్మద్ ఇస్మాయిల్‌కు ఆఫర్ చేశాడు. ఈ విషయాన్ని మహ్మద్ ఇస్మాయిల్ మహ్మద్ మోయిజ్‌కు తెలిపాడు. తనను చంపాడానికి నవీద్ గఫార్ ఖురేషి పథకం వేయగా.. నవీద్‌నే హత్య చేయాలని మహ్మద్ మోయిజ్ హత్యకు పథకం వేశారు. ఇందులో భాగంగా ఈనెల 26న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఘనీ ఖురేషి కుమారుడు నవీద్‌ను మటన్ షాపులో కూర్చొబెట్టి భోజనానికి ఇంటికి వెళ్లాడు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మోయిజ్ తన స్నేహితులైన మహ్మద్ ఇస్మాయిల్, ఈదిబజార్ కుమ్మర్‌వాడీకి చెందిన సయ్యద్ సైఫ్ ఆలియాస్ అద్నాన్ (19)తో కలిసి మటన్ షాపునకు చేరుకొని నవీద్‌పై కత్తితో దాడి చేసి పారిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నవీద్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై తండ్రి ఘనీ ఖురేషి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శనివారం గౌలిగూడ ఎంజీబీఎస్ బస్టాండ్‌లో పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న మహ్మద్ మోయిజ్, మహ్మద్ ఇస్మాయిల్, సయ్యద్ సైఫ్ ఆలియాస్ అద్నాన్‌లను సౌత్, ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సంతోష్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని శనివారం రిమాండ్‌కు తరలించారు.